కంపు కొడుతున్న కాలనీలు..
పొంచి ఉన్న ప్రమాదాలు !

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం

విద్యుత్ తీగలను అల్లుకున్న చెట్ల కొమ్మలు | ఆందోళన చెందుతున్న పలు కాలనీవాసులు



మురుగుతో కుషాయిగూడ వీధులు



కాలనీలో విద్యుత్ తీగలను అల్లుకున్న చెట్ల కొమ్మలు

కుషాయిగూడ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వీధులన్నీ ఓ వైపు బురదమయంగా మారగా.. మరోవైపు విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగులుతుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. మ్యాన్‌హోల్స్ నుంచి మురుగంతా బయటకు పొంగడంతో రోడ్లన్నీ మురుగు మయంగా మారాయి. దీనిపై అధికారులు స్పందించి మురుగు సమస్యకు పరిష్కారం చూపి రోడ్లను శుభ్రం చేయాలని కోరుతున్నారు.

◆ చర్లపల్లి డివిజన్, సుభాష్‌నగర్ కాలనీలో విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు ప్రమాదకరంగా మారాయి. ఓ బారీవృక్షం ప్రమాదకరంగా మారింది. అది కూలితే 4 వైపుల ఉన్న విద్యుత్ తీగలు తెగిపడటంతో పాటుగా కరెంటు పోల్స్ కూడా కూలిపోయి పెనుప్రమాదం జరిగే అవకాశం ఉందని పలువురు వాపోతున్నారు.

మా పరిధిలోకి రాదని సమాధానం..

కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు విద్యుత్‌శాఖ అధికారులను సంప్రదించి సమస్యను వివరించగా.. వారు తమ పరిధిలోకి రాదని, జీహెచ్‌ఎంసీ కార్యాలయాన్ని సంప్రదించాలని సలహా ఇస్తున్నారని వాపోతున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారుల వద్దకు వెళ్తే.. అది మా సమస్య కాదు విద్యుత్‌శాఖ వారే చూసుకుంటారని చెప్పడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితిలో ఉన్నామని కాలనీవాసులు చెబుతున్నారు.

సమన్వయం లోపం..

అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా వారు స్పందించి సమస్యలను పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చెట్టుకొమ్మ కూలితే పెను ప్రమాదం



ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు కారణంగా చెట్లు కూలడం, కరెంటు తీగలు తెగిపడటం వంటి ఘటనలు చోటు చేసుకుంటాయి. మా కాలనీలో అలాంటి సమస్యే ఉంది. విద్యుత్‌శాఖ, జీహెచ్ఎంసీ అధికారులను సంప్రదిస్తే మాకు సంబంధం లేదంటూ.. ఒకరిపై ఒకరు చెప్పుకోవడం బాధాకరం. వారు సమన్వయంతో స్పందించి ప్రమాదం భారి నుంచి కాలనీవాసులకు రక్షణ కల్పించాలి.

– అనుముల నర్సింహ్మారెడ్డి, సుభాష్‌నగర్

గ్రీన్‌పార్కు కాలనీని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతా

కాప్రా: గ్రీన్‌పార్క్ కాలనీని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి అన్నారు. గురువారం కాలనీలో పర్యటించిన ఆయన యూజీడీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రీన్‌పార్క్ కాలనీని ఆధునిక పద్ధతిలో సుందరీకరణ, కాలనీలో మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పుతామని పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ ఎలక్ట్రిక్ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని కార్పొరేటర్ సూచించారు. డివిజన్ పరిధిలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు సమస్యలు గుర్తించి పరిష్కరించాలన్నారు. డివిజన్ పరిధిలోని నిర్మల్‌నగర్ నుంచి కాప్రా తహసీల్దార్ ఆఫీస్ వరకు, అక్కడి నుంచి సాయిబాబానగర్ వరకు ఒక్కో ఇన్‌చార్జ్, ఇద్దరు సహాయక సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ డీఈ రవీందర్, సూపర్‌వైజర్ రాకేష్, సిబ్బంది రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. గురువారం నాలా పరివాహక ప్రాంతాలైన సోనియాగాంధీనగర్, గాంధీనగర్, మారుతీనగర్, ద్వారకాపురి, ఐజీ కాలనీల్లో ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పర్యటించి, అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు, వివరాలను తెలియచేశారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, బాల్‌నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

యాదవులపై దాడులు సహించబోం !



సంఘీభావం తెలుపుతున్న గ్రేటర్ యాదవ సంఘం సభ్యులు

మల్కాజిగిరి: రాష్ట్రంలో యాదవులపై దాడులకు పాల్పడితే సహించమని గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం నాయకులు హెచ్చరించారు. ఇటీవల మల్కాజిగిరికి చెందిన యాదవ నాయకులు చిన్నాయాదవ్, రాముయాదవ్‌లపై జరిగిన రాజకీయ దాడులను వారు ఖండించారు. సంఘసేవకుడు మండల రాధాకృష్ణయాదవ్‌పై మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి సవాళ్ల తీరుతో గురువారం గ్రేటర్ సంఘం నాయకులు చిన్నాయాదవ్, రాముయాదవ్‌లను పరామర్శించి మండల రాధాను కలిసి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దాడులపై ఫోన్ చేసిన సంఘసేవకుడు మల్కాజిగిరి వాసిపై మాజీ ఎమ్మెల్యే మాట్లాడిన భాష, వ్యవహరించిన తీరు సరికాదన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా చేసిన మైనంపల్లి హుందాగా ప్రవర్తించలేదన్నారు. సహనాన్ని పరీక్షించవద్దని యాదవులు ఐక్యంగా వస్తే తట్టుకోలేరన్నారు. వివిధ రాజకీయ పార్టీల పెద్దలు కూడా ఇలాంటి ఘటనలపై మాట్లాడకపోవడం దురదృష్టకరమన్నారు. గ్రేటర్ యాదవ సంఘం చైర్మన్ కిషోర్‌యాదవ్, అధ్యక్షుడు బోయిని వెంకటేష్‌యాదవ్, సలహాదారుడు పాండు యాదవ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో 'కార్డన్‌సెర్చ్'

- 49 లీటర్ల మద్యం, గుట్కా ప్యాకెట్లు
- 27 ద్విచక్రవాహనాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను పరిశీలిస్తున్న డీసీపీ

మల్లాపూర్: నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లాపూర్ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో గురువారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మల్కాజ్‌గిరి డీసీపీ పద్మజ ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. మొత్తం 32 బ్లాక్‌లలోని 512 ఇళ్లలో క్షుణ్ణంగా తనిఖీ చేపట్టారు. అనంతరం డీసీపీ పద్మజ మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. బెల్ట్‌షాపులలో మొత్తం 49 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. 7 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు, రెండు బ్యాగుల గుట్కా ప్యాకెట్లు, 106 బీర్లు, సిగరెట్ ప్యాకెట్లు, రిజిస్ట్రేషన్ లేని 27 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. రౌడీషీటర్లకు డీసీపీ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇటీవల నాకాబందీ, కార్డన్‌సెర్చ్ వంటివి చేపట్టి ప్రజలకు భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. కాలనీల్లో అనుమానిత వ్యక్తులు తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ పద్మజ

అదనపు డీసీపీ వెంకటరమణ, ఏసీపీ చక్రపాణి, నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్విర్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు భద్రతా కిట్ల పంపిణీ



భద్రతా కిట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని ఎంటమాలజీ పారిశుద్ధ్య కార్మికులకు గురువారం కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ భద్రత కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్య సిబ్బంది సేవలు అభినందనీయమని, వారు చేసే సేవలు ఎనలేనివన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటాం

మౌలాలి : గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు అండగా ఉండి అన్ని విధాల ఆదుకుంటానని మల్కాజిగిరి బీజేపీ సీనియర్ నేత గున్నాల చంద్రశేఖర్‌యాదవ్ హామీ ఇచ్చారు. మౌలాలి డివిజన్ పరిధిలోని బృందావన్‌కాలనీ తదితర ప్రాంతాల్లో గురువారం పర్యటించిన ఆయన ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు శివగౌడ్, కాలనీవాసులు వెంకటరమణ, ఝాన్సీ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థల్లో స్టేషనరీ విక్రయం !

తగిన చర్యలు తీసుకోవాలని వినతి

మల్కాజిగిరి: మండలంలో కొన్ని ప్రైవేట్ స్కూల్స్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ సీనియర్ నేత వేణుయాదవ్ మండల విద్యాధికారి సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల్లోనే పుస్తకాలు, స్టేషనరీ విక్రయిస్తున్నా.. అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. స్థానిక కార్పొరేటర్ దృష్టికి సైతం తీసుకెళ్లామన్నారు.

అన్నదానం

కుషాయిగూడ: అమావాస్య సందర్భంగా గురువారం కుషాయిగూడ మార్కెట్ వద్ద హనుమాన్ విగ్రహ నిర్మాణ సమితి, భజరంగ్‌దళ్, కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సేవా కార్యక్రమాన్ని భవిష్యత్తులోనూ కొనసాగిస్తామన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చక్రపాణిగౌడ్, రాజుముదిరాజ్, యావపురం రవి తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు చేయూత

మల్లాపూర్: ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వేముల మారయ్య ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు బియ్యంతో పాటు ఖాకీ షర్ట్‌ను కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా పంపిణీ చేశారు. ఆటో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పాండునాయక్, శాతం రమేష్, రవి, సాదిక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



జలమండలి జీఎంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఐఎన్‌నగర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి గురువారం జలమండలి జీఎం వినోద్‌కుమార్‌ను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఐఎన్‌నగర్‌లో తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీఆర్‌ఎస్ నేతలు మేకల రాము యాదవ్, జేపీసీ వెంకన్న, హేమంత్ పటేల్, నగేష్, వంశీముదిరాజ్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరీ అలంకరణలో పోచమ్మ



కుషాయిగూడ: ఆషాఢమాసం, అమావాస్య సందర్భంగా గురువారం కుషాయిగూడ పోచమ్మ ఆలయంలో భక్తులు అమ్మవారికి శాకంబరీ అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రత్యేక గ్రేవియార్డు కేటాయించాలి

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్‌లో క్రిస్టియన్ మైనార్టీలకు ప్రత్యేక గేవియార్డు కేటాయించాలని ఉప్పల్ నియోజకవర్గ పాస్టర్ల సంఘం ప్రతినిధులు గురువారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఉన్నతాధికారులతో సంప్రదించి త్వరలో తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. పాస్టర్స్ సంఘం ప్రతినిధులు గొనే సోలమన్‌రాజ్, రిచర్డ్, దేవరాజు, ఇన్నాబు, ఇల్లూరి ప్రసాద్‌రావు, ఏఎస్ అనిల్‌రాజు తదితరులున్నారు.

ఒకే ట్రాక్టర్.. రెండు నెంబర్లు !

మేడిపల్లి: మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వరంగల్ హైవేపై ఉప్పల్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. పోలీసుల తనిఖీల్లో ఓ ట్రాక్టర్‌ను తనిఖీ చేయగా.. ముందు భాగంలో (ఏపి16బీఆర్7116), వెనక భాగంలో (ఏపీ29ఈ4126) నెంబర్ ఉంది. సరైన రిజిస్ట్రేషన్ పత్రాలు లేకపోవడంతో ఎంవీఐ రవీందర్‌రెడ్డి వాహనాన్ని సీజ్ చేసి మేడిపల్లి పోలీసులకు అప్పగించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ.. ఇలాంటి నెంబర్ ట్యాంపర్ మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చెరువు సంరక్షణకు తగిన చర్యలు

కాప్రా: కాప్రా చెరువులో నీటి వనరుల సంరక్షణకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి అన్నారు. గురువారం జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, కాప్రా డిప్యూటీ కమిషనర్ జగన్, కాప్రా మండల తహసీల్దార్ సుచరిత, కుషాయిగూడ ఏసీపీ వెంకటరెడ్డి, ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి, ఇరిగేషన్ అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం అధికారులతో కలిసి చెరువును సందర్శించారు. చెరువు సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, చెరువు పరిసర ప్రాంతాల్లో గంజాయి, మద్యం సేవిస్తున్నారనే విషయం తన దృష్టికి రావడంతో అలాంటి కార్యకలాపాలు నివారించేందుకు పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

ఉప్పల్: ఉప్పల్ శివశంకర మహామాయి దేవాలయంలో ఆషాఢమాసం అమావాస్య సందర్భంగా ఉప్పల్ గ్రామపెద్దలు, నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ నిర్వాహకులు బలవంతచారి, బిక్షపతి , రాజగోపాలచారి, శ్రీనివాస్, పురుషోత్తం, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

పోచారం: నారపల్లిలోని ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో సీజ్ చేసిన 3 వాహనాలకు శనివారం ఉదయం వేలంపాట నిర్వహించనున్నట్లు ఇన్‌స్పెక్టర్ జూపల్లి రవి తెలిపారు. వివరాలకు 8712658736, 9642377661.

నిమజ్జన ఘాట్‌లో బోర్ల ఏర్పాటు



అధికారులతో కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: సఫిల్‌గూడలోని మినీట్యాంక్ బండ్ వద్ద నిమజ్జనఘాట్‌లో రెండు పవర్‌బోర్లు ఏర్పాటు చేస్తున్నామని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. గురువారం బోర్లు ఏర్పాటు చేసే పాయింట్లను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఏడాది వినాయక నిమజ్జనం, బతుకమ్మ నిమజ్జన సమయంలో మురికి నీరు కాకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని నింపి చేసేవాళ్లమన్నారు. ఇప్పుడు రెండు పవర్‌బోర్ల ఏర్పాటుతో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాల్సిన అవసరం లేదన్నారు. డీఈ మహేష్, ఏఈ నవీన్, వీఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వరద నీటితో అవస్థలు

బోడుప్పల్: గత 4 రోజులుగా కురుస్తున్న వర్షాలకు బోడుప్పల్ అంబేద్కర్‌నగర్ చౌరస్తా వద్ద ఓ ఇల్లు వరద ముంపునకు గురైంది. కాలనీలో ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు దిగువన ఉన్న ఓ ఇంట్లోకి వచ్చి చేరాయి. సదరు ఇంటి యజమాని ఇంట్లో నీళ్లెత్తి పోస్తోంది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. కావున మున్సిపల్ అధికారులు స్పందించి ముంపునకు గురికాకుండా చూడాలని కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మల్లాపూర్: వర్షాకాలం సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ జాయింట్ కమిషనర్ ఎస్.శంకర్ సూచించారు. గురువారం మల్లాపూర్ దత్తాత్రేయనగర్ కాలనీలో వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రతి ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటినిల్వలను పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించారు. సర్కిల్ ఎంటమాలజీ ఏఈ రమేష్, సూపర్‌వైజర్ కనకరాజు, మలేరియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులతో పరమేశ్వర్‌రెడ్డి

కుషాయిగూడ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ మీర్‌పేట్, హెచ్‌బీకాలనీ డివిజన్ పార్టీ అధ్యక్షుడు పోలేపాక అంజయ్య గురువారం రాజీవ్‌నగర్ ప్రభుత్వ స్కూల్‌లో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించి అభినందించారు. మల్లేష్, మల్లేష్‌గౌడ్, యాకయ్య, అనిల్, జెమిని, కృష్ణనాయక్, రాజు, శ్రీకాంత్, ఉదయ్, సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆచూకీ లభ్యం

ఇంటికి చేరిన అదృశ్యమైన బాలుడు



కుషాయిగూడ: తాత మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిన ఓ బాలుడు తిరిగి గురువారం తెల్లవారుజామున ఇంటికి చేరుకున్నాడు. మీర్‌పేట్–హెచ్‌బీ కాలనీ డివిజన్, వేంకటేశ్వరనగర్ కాలనీకి చెందిన బేతి పాండు మనవడు రిషేంద్ర బుధవారం ఇంటి నుంచి బయటికి వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో తాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో చర్లపల్లి పెట్రోల్‌బంకు వద్ద అనుమానాస్పదంగా కనిపించిన బాలుడి వివరాలను వాహనదారులు అడిగి తెలుసుకున్నారు. కుటుంబసభ్యులకు ఫోన్ చేసి మాట్లాడి విషయం చెప్పడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. బాలుడిని ఇంటికి చేర్చిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆకట్టుకున్న స్టూడెంట్స్ 'ఇన్వెస్టీచర్ సెరిమనీ'



అల్వాల్: లయోలా అకాడమీ జూనియర్ కళాశాలలో 'స్టూడెంట్స్ ఇన్వెస్టీచర్ సెరిమనీ' కార్యక్రమం ఘనంగా జరిగింది. గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, అల్వాల్ సర్కిల్ డీసీ శ్రీనివాస్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలన్నారు. అదే విధంగా లక్ష్యాలను ఏర్పరచుకుని ముందుకుసాగాలన్నారు. లయోలా అకాడమీ కార్యదర్శి రెవరెండ్ ఫాదర్ డాక్టర్ ఫ్రాన్సిస్ గ్జేవియర్, ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ జగదీష్, దీపరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించండి !

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. మల్లిఖార్జున నగర్, జ్యోతినగర్, సాయినగర్ తదితర ప్రాంతాల్లో రోడ్ల పక్కన చెత్త,చెదారం వేయడంతో పాటు గంటల తరబడి నిల్వ ఉండటంతో ఆయా కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమయానికి చెత్తను తరలించే వాహనాలు సమయానికి రాకపోవడంతో సమస్య ఉత్పన్నమవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చెత్తను ఎప్పటికప్పుడు డంపింగ్‌యార్డుకు తరలించాలని కోరారు.



గౌతంనగర్‌లో రోడ్డు పక్కన ఇలా..

కార్పొరేటర్‌కు ఆహ్వానం



కార్పొరేటర్‌కు ఆహ్వానపత్రికను అందజేస్తున్న కాలనీ ప్రతినిధులు

మౌలాలి: ద్వారకమాయకాలనీ ఫేజ్–2 నూతనంగా నిర్మించిన కమ్యూనిటీహాల్ ప్రారంభోత్సవం, పోచమ్మ దేవాలయం విగ్రహ ప్రతిష్ఠాపనకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని మౌలాలి కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్‌ను కాలనీసభ్యులు ఆహ్వానించారు. ఈ మేరకు గురువారం ఆమెను కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. ఈనెల 30, 31న కమ్యూనిటీహాల్ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు కనుల పండువగా నిర్వహించనున్నట్లు వివరించారు. కాలనీ అధ్యక్షులు కుమారస్వామి, పెంటయ్యయాదవ్, మల్లయ్య, బాలాజీ, శ్రీశైలం, సంపత్ తదితరులున్నారు.

పండుగలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి

మేడిపల్లి: బోనాల పండుగ సందర్భంగా మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి అధ్యక్షతన గురువారం మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లోని ఆలయ కమిటీ చైర్మన్, ఆలయ కమిటీల ఆర్గనైజర్లతో మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు శాంతియుతంగా బోనాల జాతరను జరుపుకోవాలని ప్రజలు, పౌరులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు ఏర్పాట్లపై చర్చించారు. పలహారబండ్లు, తొట్టెలు తీసేవారు ముందుగా పోలీస్ వారికి తెలిపే తగిన బందోబస్తును ఏర్పాటు చేస్తామని ఇన్‌స్పెక్టర్ స్పష్టం చేశారు. వివిధ కాలనీల చైర్మన్లు, ఆలయ చైర్మన్లు, ఆర్గనైజర్లు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ ముస్కాన్'లో 9 మందికి విముక్తి

మేడ్చల్: బాలకార్మికులతో పనిచేయిస్తున్న వారి భరతం పట్టేందుకు ఏర్పాటైన 'ఆపరేషన్ ముస్కాన్' అధికారులు గురువారం మేడ్చల్ పరిధిలో పలు పరిశ్రమలు, హోటళ్లలో దాడులు నిర్వహించి 9 మంది బాలకార్మికులకు వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలకార్మికులతో పనిచేయిస్తున్నారని, పలు సంస్థలపై ఆకస్మిక దాడులు చేయగా.. మేడ్చల్ పారిశ్రామికవాడలోని జీజేఆర్ కంపెనీలో ముగ్గురు, సర్వోత్తం స్టీల్‌లో ఒక్కరు, ఎలిమెంట్ సెవెన్ బార్‌లో ముగ్గురు, వివిధ హోటళ్లలో పనిచేస్తున్న మరో ఇద్దరు బాలకార్మికులను గుర్తించి వారికి వెట్టి చాకిరి నుంచి విముక్తి కల్పించారు. బాలకార్మికులతో పనిచేయిస్తున్న యాజమాన్యాలపై కేసులు నమోదు చేస్తున్నట్లు అధికారులు వివరించారు.